క్లుప్తంగా

విజయవంతం చేయాలి

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26న చేపట్టిన కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సాయిప్రకాష్ మంగళవారం ప్రకటనలో కోరారు. ప్రతి గ్రామపంచాయతీలో వెయ్యి మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. మొక్కలు నాటే కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు.

లెప్రసీపై ఇంటింటి సర్వే



అలంపూర్ రూరల్: క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం వైద్యసిబ్బంది లెప్రసీపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్టు లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వివరాలు నమోదు చేసుకున్నారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో నోడల్ అధికారి బాలీశ్వరయ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం పాటించాలి



అలంపూర్ రూరల్: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధం పాటించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎంపీఓ చంద్రకళ కోరారు. మండలంలోని కోనేరు, బుక్కాపూర్ గ్రామపంచాయతీలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య పనుల తోపాటు సెగ్రిగేషన్ షెడ్, తాగునీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు నరేష్, ఓబులమ్మ పాల్గొన్నారు.


మహిళలకు వైద్యపరీక్షలు

మానవపాడు: మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ రిజ్వానా తస్నీర్ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా 50మందికి పలు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చంద్రన్న, సంధ్యారాణి, శారద, సోని, పరిమళ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

అయిజ: మండలంలోని ఉత్తనూరు, చిన్నతాండ్రపాడు గ్రామాల్లో మంగళవారం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా టీకాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాలకు దారి చూపండి



అయిజ: మండలంలో భారతమాల రోడ్డు నిర్మాణంతో రైతుల పంట పొలాలకు వెళ్లే దారి లేకుండాపోయిందని, పంట పొలాలకు వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ షహిదాబేగానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు



ఉండవెల్లి: మండలంలోని మారమునగాల-2లో మంగళవారం వర్షాల కోసం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మకు పూజలు నిర్వహించి భజనలు చేశారు. అనంతరం కృష్ణానది నుంచి నీటిని తీసుకొచ్చి బొడ్రాయికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మంత్రికి క్షమాపణ చెప్పాలి

అలంపూర్: మంత్రి హరీష్‌రావుపై వ్యక్తిగత విమర్శలు చేసిన మైనంపల్లి హనుమంతరావు బహిరంగ క్షమాపణ చెప్పాలని హరీష్‌రావు టీం జిల్లా అధ్యక్షుడు డేవిడ్ మంగళవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితాలో మైనంపల్లి కుమారుడి పేరు లేకపోవడంతో మంత్రి హరీష్‌రావుపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. పార్టీ నిబంధనలకు వ్యతిరేకంగా మాట్లాడిన మైనంపల్లిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వర్షం పడక.. పంట పండక

ఆందోళనలో రైతన్న

- ఎండుముఖం పట్టిన పంటలు
- వర్షాల కోసం ఎదురుచూపు
- ఇప్పటికే 25శాతం మిరప, పత్తిపంట తొలగింపు



ఉండవెల్లిలో ఎండుముఖం పట్టిన పత్తిపంట



భూమిలో తేమశాతం లేక పెరగని పత్తిచేను

ఉండవెల్లి: కర్షకులపై వరుణుడి కరుణ కరువైంది. కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. వర్షాల కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. పంటలు పచ్చగా ఉండాల్సిన సమయంలో వర్షాలు లేకపోవడంతో ఎండుముఖం పడుతున్నాయి. అలంపూర్ నియోజకవర్గంలో పత్తి, మిరప, మొక్కజొన్న, కంది, ఉల్లి ఇతర పంటలను సాగు చేశారు. పత్తి సాగుచేసి రెండునెలలు అవుతున్నా పెరగకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మిగతా పంటలు ఎండుముఖం పట్టాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఇప్పటికే 50 ఎకరాల్లో పత్తి, 40ఎకరాలకుపైగా మిరప పంటను రైతులు తొలగించారు. ప్రతి ఏడాది రైతులకు ఏదో రకంగా నష్టం వాటిల్లుతూనే ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు చేసిన అప్పులను తీర్చలేక భూములను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. వ్యవసాయం చేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు.

పంటలను కాపాడుకునేందుకు అవస్థలు

వర్షాభావ పరిస్థితులతో పంటలను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడాల్సి వస్తోంది. పంటలు తెగుళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. క్రిమిసంహారక మందుల వాడకంలో ఫర్టిలైజర్ దుకాణదారులు రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వ్యవసాయాధికారులు కేవలం రోడ్ల పక్కనున్న పంటలను మాత్రమే పరిశీలించి వెళ్తున్నారని, మిగతా పంటలకు ఎంత మోతాదులో ఏ మందులు వాడాలో తెలియక రైతులు నష్టపోతున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండి పంటల సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు చేయాలని కోరుతున్నారు.

నీళ్లు లేక ఇబ్బందులు..



పంటలకు సరైన సమయంలో నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. రెండెకరాల్లో మొక్కజొన్న చేను ఎండిపోవడంతో తొలగించాను. దాదాపు రూ.20వేల నష్టం వాటిల్లింది. పంటలను కాపాడేందుకు ఆర్డీఎస్ నుంచి నీటిని విడుదల చేయాలి. వర్షాలు లేక పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

– ఖాసీం, రైతు, ఉండవెల్లి

ఆర్డీఎస్ నీరు వదలాలి..



వర్షాలు లేక పంటలు ఎండుముఖం పడుతున్నాయి. బోరుబావుల్లో కూడా నీటిశాతం తగ్గింది. అధికారులు స్పందించి ఆర్డీఎస్ నుంచి నీటిని విడుదల చేయాలి.లేకపోతే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

– ఈదన్న, రైతు, లింగన్‌వాయి

పత్తిపంటలో తెగుళ్లను నివారించాలి



పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఓ అనిత

అలంపూర్ రూరల్: పత్తిపంటకు పచ్చదోమ, తెల్లదోమ, తామర పురుగులు ఆశిస్తున్నాయని.. వాటి నివారణకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారిణి అనిత రైతులకు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పత్తిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పత్తిపంటలో తెగుళ్ల నివారణకు ఎసిటామిప్రీడ్ 0.2 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 గ్రా. లేదా డైఫెన్‌థ్యూరాన్ 1.25 గ్రా., థయోమిథాక్సామ్ 0.2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పూత దశ నుంచి గులాబీరంగు పురుగు ఉనికిని గమనించడానికి ఎకరాకు 8 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. భూమిలో తేమ ఉంటే ఎకరాకు 25కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ చల్లాలని సూచించారు.

ఘనంగా జానపద కళాకారుల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న జానపద కళాకారులు

అయిజ: మండల కేంద్రంలో మంగళవారం జానపద కళాకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాకారుల కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదాచారి, ప్రధాన కార్యదర్శి తిమ్మప్ప మాట్లాడుతూ జానపద కళాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని కోరారు. కళాకారులందరూ బీమాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాకారుల సంఘం నాయకులు ఆంజనేయులు, గోవింద్‌గౌడ్, నర్సింహాచారి, బీచుపల్లి, బజారి, వసూరప్ప, వెంకట్రాములు, అంజి, సీతారాములు, భీమన్న, అశోక్‌గౌడ్, నారాయణగౌడ్, రాజు, ఈరన్న, నర్సింహులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అలసత్వం వద్దు



చిన్నపోతులపాడులో 75 ఆకృతిలో నాటిన మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మానవపాడు: అభివృద్ధి పనుల పూర్తిపై సంబంధిత అధికారులు అలసత్వం చేయొద్దని ఎంపీడీఓ రమణారావు అన్నారు. మండలంలోని చిన్నపోతులపాడ, పెద్ద పోతులపాడు గ్రామాల్లో మంగళవారం అభివృద్ధి పనులను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో మొక్కలు నాటి, ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అదేవిధంగా పెద్ద పోతులపాడులో పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ లాలూనాయక్, హెచ్‌ఎం జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

మాది ప్రజాసంక్షేమ ప్రభుత్వం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: అన్ని వర్గాల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పాస్టర్లు, సంఘ కాపరీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు క్రైస్తవులను కేవలం ఓటుబ్యాంకుగానే భావించాయన్నారు. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ క్రైస్తవులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చారన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా పేదలకు నూతన దుస్తుల పంపిణీ, విందు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గద్వాలలో అన్ని చర్చిల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం పాస్టర్లు, సంఘ కాపరీలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి

సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతోందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కోరారు. గడపగడపకు బీఆర్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా గద్వాల మండలం ముల్కలపల్లి, తుర్కోనిపల్లిలో తన కుమారుడు సాయిసాకేత్‌రెడ్డితో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సుభాన్, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, రమేష్‌నాయుడు, అగ్గిరాముడు, చక్రధర్, నీలేశ్వర్‌రెడ్డి, బీచుపల్లి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి



అలంపూర్ రూరల్: జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి సన్నిధిలో పద్మశాలి నిత్యాన్నదాన సత్రం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని మంగళవారం ఆ సంఘం నాయకులు కలెక్టర్ క్రాంతికి వినతిపత్రం అందజేశారు. భక్తుల సౌకర్యార్థం నిత్యాన్నదాన సత్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పులపాటి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, వీరన్న, రఘు, గోపాల్ పాల్గొన్నారు.

పాదయాత్రకు ఘనస్వాగతం



శాంతినగర్: మాదాసి, మాదారి కురువలను ఎస్సీ జాబితాలో చేర్చి కుల ధ్రువపత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆ సంఘం నాయకుడు చిన్నమల్లయ్య చేపట్టిన పాదయాత్ర మంగళవారం మండల కేంద్రానికి చేరింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, వడ్డేపల్లి పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ పాదయాత్రకు ఘనస్వాగతం పలికారు. అనంతరం చిన్నమల్లయ్యను సన్మానించారు.

6వ రోజుకు చేరిన ఏఎన్‌ఎంల దీక్ష



ఒంటికాలి నిలబడి నిరసన తెలియజేస్తున్న ఏఎన్‌ఎంలు

గద్వాల రూరల్: ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో చేపట్టిన నిరసన దీక్ష మంగళవారంతో ఆరో రోజుకు చేరింది. ఏఎన్‌ఎంలు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. వీరికి సీపీఐ, ఏఐటీయూసీ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ తెలంగాణ వస్తే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ పెద్ద మోసకారి అని, తెలంగాణను ఇచ్చిన సోనియాగాంధీ, అమరవీరులు, ఉద్యమకారులను మోసం చేశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఏఎన్‌ఎంల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రంగన్న, ఏఎన్‌ఎంలు జ్యోతి, సరస్వతి, మహేశ్వరి, రాధ, హేమావతి, పుష్ప, రేణుక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ జ్యోతి

శాంతినగర్: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ జ్యోతి సూచించారు. మండల మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వడ్డేపల్లి మండలస్థాయి పాఠశాలల యాజమాన్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో బడిబయటి పిల్లలు లేకుండా చూడాలన్నారు. చదువు ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరును పర్యవేక్షించాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ రవీంద్ర, ఎంవీఎఫ్ ప్రతినిధులు హన్మిరెడ్డి, నాగపుల్లయ్య, ఎస్‌ఎంసీ కన్వీనర్ ఆంజనేయులు, సీఆర్‌పీఎఫ్ కన్వీనర్ సుధాకర్ పాల్గొన్నారు.

శుభ్రత అందరి బాధ్యత

అమరచింత: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా అన్నారు. ఆరోగ్య సిబ్బందితో కలిసి మంగళవారం పారిశుద్ధ్య పనులకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

ఉత్సాహంగా మండలస్థాయి క్రీడాపోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ధరూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడాపోటీలను డీవైఎస్‌ఓ బీఎస్ ఆనంద్, జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్ ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మండలస్థాయిలో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీఈటీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

ఎర్రవల్లిచౌరస్తా: తమకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం ఇటిక్యాల మండలం మొగిలిరావులచెర్వు గ్రామానికి చెందిన మార్తమ్మ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే అబ్రహంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్లాట్లలో గ్రామపంచాయతీ భవనం నిర్మించేందుకు సర్పంచ్‌తోపాటు స్థానిక అధికారులు యత్నిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. 1983లో అప్పటి ప్రభుత్వం బోయ పరుశరాముడికి 8సెంట్ల భూమి ఇవ్వగా.. ఆ భూమిని మార్తమ్మ భర్త దావీదు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. తమ ప్లాట్లలో ఇళ్లు కట్టుకునేందుకు దావీదు నలుగురు కుమారులు ప్రయత్నించగా, గ్రామ సర్పంచ్‌తోపాటు రెవెన్యూ అధికారులు అడ్డుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్థానిక తహశీల్దార్‌ను వివరణ కోరగా.. అది ముమ్మాటికి ప్రభుత్వ భూమి అని, గతంలో ప్రభుత్వం ఎవరికీ పట్టాల రూపంలో ఇవ్వలేదని తెలిపారు.

ప్రమాదకరంగా కల్వర్టులు



సాసనూలు వద్ద దెబ్బతిన్న కల్వర్టు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. వర్షాలకు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటిక్యాల–చాగాపురం, ఉదండాపురం–ఇటిక్యాల, ఎర్రవల్లిచౌరస్తా–గార్లపాడు రోడ్లపై కల్వర్టులు దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. గార్లపాడు, సాసనూలు, షేక్‌పల్లి, చాగాపురం, ఇటిక్యాల గ్రామాల సమీపంలో కల్వర్టులు కూలిపోయాయి. కల్వర్టుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దెబ్బతిన్న కల్వర్టులకు మరమ్మతు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

పందుల స్వైరవిహారం



ఎర్రవల్లి చౌరస్తాలో పందుల గుంపు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి గ్రామపంచాయితీలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇళ్ల మధ్యే పందుల పెంపకాన్ని చేపడుతుండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పందు సంచారంతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి పందులను గ్రామానికి దూరంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పీజీ ఎంట్రెన్స్‌లో విద్యార్థి ప్రతిభ

ధరూరు: పీజీ ఎంట్రెన్స్ టెస్టులో మండలంలోని నీలహళ్లికి చెందిన సాయన్న కుమారుడు శ్రీధర్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో 50వ ర్యాంకు సాధించాడు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2018–20లో హెచ్‌ఈసీ, నిజాం కళాశాలలో 2020–23 డిగ్రీ పూర్తి చేశాడు. పీజీ ఎంట్రెన్స్ ఎకనామిక్స్ సబ్జెక్టులో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో 50వ ర్యాంకు సాధించడంపై జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

దుస్తులు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న అభిమానులు

రాజోళి: మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ఆయన అభిమానులు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అంతకు ముందు కేక్ కట్ చేసి చిరంజీవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నిషాక్, శివరామయ్య, శాంతయ్య, రంగయ్య, హుస్సేన్, చేనేత గ్రామిక సేవా సమితి సభ్యుడు వీరేష్ తదితరులు పాల్గొన్నారు.